# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-08-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈరోజు సాయంత్రం జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తారు.**

**2. రాష్ట్ర అగ్నిమాపక శాఖకు చెందిన 58 ఆధునిక అగ్నిమాపక వాహనాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రారంభించారు.**

**3. రాష్ట్రంలో రోజువారీ వ్యర్థాల నిర్వహణ కోసం 107 మున్సిపాలిటీల్లో ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ వెల్లడించారు.**

**4. స్వయం సహాయక సంఘాల మహిళలను ఉపాధి కల్పించే పారిశ్రామికవేత్తలుగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.**

==========================

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈరోజు సాయంత్రం జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తారు. సాయంత్రం 7 గంటలకు ఆల్ ఇండియా రేడియో జాతీయ నెట్‌వర్క్‌లో రాష్ట్రపతి ప్రసంగం ప్రసారం కానుంది. దూరదర్శన్ ఛానళ్లలో ముందుగా హిందీలో, ఆ తర్వాత ఆంగ్లంలో ప్రసారం చేస్తారు. ఆల్ ఇండియా రేడియో ప్రాంతీయ నెట్‌వర్క్‌లలో రాత్రి 9 గంటల 30 నిమిషాలకు ప్రాంతీయ భాషలలో ప్రసారం చేస్తుంది.

ఇదిలా ఉండగా, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య ఫలాలను అందించిన మహనీయులైన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాల్సిన రోజే స్వాతంత్ర్య దినోత్సవమని గవర్నర్ పేర్కొన్నారు. సత్యం, అహింస, శాంతి, ఐక్యత, సోదరభావం వంటి ఉన్నత ఆదర్శాలకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

--------------------------

రాష్ట్ర అగ్నిమాపక శాఖకు సుమారు 40 కోట్ల రూపాయలతో సమకూర్చిన 58 ఆధునిక అగ్నిమాపక వాహనాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు జెండా ఊపి ప్రారంభించారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు హోంమంత్రి వి.అనిత, అగ్నిమాపక శాఖ డీజీ వెంకట రమణ, అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇందులో 25 అధునాతన అగ్నిమాపక వాహనాలు,

20 వాటర్ బౌజర్లు, 13 బహుళ ప్రయోజన ఫైర్‌ఫైటింగ్ వాహనాలు ఉన్నాయని, గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధునాతన ఫైర్‌ఫైటింగ్ వాహనాలు, భారీ అగ్నిప్రమాదాల్లో నిరంతర నీటి సరఫరా కోసం వాటర్ బౌజర్లను అందుబాటులోకి తీసుకొచ్చామని అధికారులు తెలిపారు.

---------------------------

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయనగరంలో నిర్వహించిన తిరంగా ర్యాలీని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈరోజు జెండా ఊపి ప్రారంభించారు. విజయనగరంకోట దగ్గర నుంచి గంటస్తంభం వరకు నిర్వహించిన తిరంగా ర్యాలీలో పార్లమెంట్ సభ్యులు అప్పలనాయుడు, జిల్లా కలెక్టర్ రామసుందర్ రెడ్డి, ఎస్పీ దామోదర్ పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని అన్నారు. వారి స్ఫూర్తిని తెలియజేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని మంత్రి తెలుపుతూ,

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

రాష్ట్రంలో ప్రతిరోజూ ఉత్పత్తి అవుతున్న 7 వేల టన్నుల వ్యర్థాల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో పాత వ్యర్థాల శుద్ధి కర్మాగారాన్ని మంత్రి ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే 85 లక్షల టన్నుల చెత్తను తొలగించామని, మిగిలిన 70 లక్షల టన్నుల చెత్తను ఈ ఏడాది అక్టోబర్ నాటికి పూర్తిగా తొలగిస్తామని చెప్పారు. రోజువారీ వ్యర్థాల నిర్వహణ కోసం రాష్ట్రంలోని 107 మున్సిపాలిటీల్లో తాజా వ్యర్థాల ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని, సెప్టెంబర్ నెలాఖరులోగా వాటిని పూర్తి చేస్తామని తెలిపారు.

---------------------------

మచిలీపట్నం ఓడరేవు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కృష్ణాజిల్లాలోని మచిలీపట్నంలో పోర్టు నిర్మాణ పనులను అధికారుల బృందంతో కలిసి మంత్రి ఈరోజు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 2027 మార్చి-జూన్ మధ్య పోర్టును ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని దీనికి అనుసంధానంగా రైల్వే, రోడ్డు అనుసంధాన పనులు జరుగుతున్నాయని చెప్పారు. పోర్టు ఆధారిత పరిశ్రమలతో మచిలీపట్నం పరిసర ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

స్వయం సహాయక సంఘాల మహిళలను ఉపాధి కల్పించే పారిశ్రామికవేత్తలుగా మార్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆహార శుద్ధి పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శు ద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పి.ఎం.ఎఫ్.ఎం.ఇ. పథకాన్ని స్త్రీనిధి రుణ సహకార సమాఖ్యతో అనుసంధానిస్తూ

ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. దీని ద్వారా అర్హత కలిగిన మహిళలు స్త్రీనిధి రుణంతో మూడు లక్షల రూపాయల వ్యయంతో ఆహార శుద్ధి యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు.మహిళలకు రుణం అందించడమే కాకుండా, వారి వ్యాపారం విజయవంతమయ్యే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

--------------------------

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రకాశం జిల్లావ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు. ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, జాయింట్ కలెక్టర్ కల్పన కుమారితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని ప్రజల్లో నింపడంతో పాటు పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టామని చెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా కలెక్టర్ తెలియజేస్తూ ..

వాయిస్ ..30.. సెకన్లు

--------------------------

రాష్ట్రంలో గ్రామీణ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి తెలిపారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద రాష్ట్రంలోని 158 గ్రామాలకు తొలిసారిగా రహదారి సౌకర్యం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం 446 కోట్ల 57 లక్షల రూపాయలు మంజూరు చేసిందని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ నిధులను రోడ్ల నిర్మాణానికి, రహదారుల నిర్వహణకు వినియోగించనున్నట్లు తెలిపారు. వీటి ద్వారా 158 గ్రామాల్లో 165 రోడ్లు, 19 వంతెనలు నిర్మించనున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పురంధేశ్వరి పేర్కొన్నారు.

--------------------------

నేతన్నల సేవలో పథకం కింద అర్హులైన చేనేత కార్మికులందరికీ ఆర్థిక సాయం అందిస్తామని చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ఒక ప్రకటనలో తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల కొందరి ఖాతాల్లో నగదు జమ కాలేదని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇప్పటికే పలువురు చేనేత కార్మికుల ఖాతాల్లో 25 వేల రూపాయల చొప్పున సాయం జమ చేసినట్లు చెప్పారు. ఇటీవల వచ్చిన కొత్త దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, అర్హులైన వారికి ఈ నెల 20వ తేదీలోగా ఆర్థిక సాయం అందిస్తామని వెల్లడించారు.

--------------------------

మార్కాపురం జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్టు పనుల పరిశీలనలో భాగంగా జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రాజెక్టు సొరంగాలలో పర్యటించారు. ఈ సందర్భంగా టీబీఎం యంత్రాల వెలికితీత, లైనింగ్ పనులను అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. మిగిలిన పనులను మరో వారంలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నెలలోనే జంట సొరంగాల ద్వారా నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలను విడుదల చేస్తామని తెలిపారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

=====================